


# నడుస్తున్న చరిత్ర

నిడదవోలు మాలతి.

"నవంబరు ఒకటో తారీఖు"
అంది కేలండరు.

"ఆరు" అంది గోడనున్న గడియారం. సాయంత్రం వేళ అది.

'నోటి దగ్గర పెట్టుకో'బోతున్న పాలగ్లాసు క్రిందపెట్టేసి, కల్యాణి "అమ్మయ్యో!" అంటూ ఆదరా బాదరా 'కిల్డ్ బోట్సు' వేసుకోడంలో మునిగిపోయింది. పదేళ్ల తన స్కూలు చరిత్రలో ఇవాళ తను పది నిముషాలు ఆలస్యంగా వెళ్తోంది.

"అమ్మా! వెళ్తున్నా" అని కేకేసి వెళ్తున్న కల్యాణి "ఎక్కడికి" అని వంటింట్లోంచి తల్లి అడగడంతో క్షణం ఆగింది. ఈ సమయంలో తను రోజూ ఎక్కడికి వెళ్తోందో తల్లికి తెలీదా?

"స్కూలికి" అంది ఒక్క అంగలో గేటు దాకా వెళ్లి.

"కల్యాణీ!"

"టైమయిపోయిందమ్మా" అంది కల్యాణి నసుగుతూ, వెనక్కి వచ్చి, పాలు తాగడం తనకు యిష్టం. తాగకపోతే అమ్మకి కష్టం. పోల్చి అమ్మని చూసి కల్యాణి పాల గ్లాసు తీసుకుంది.

"స్కూలికి వెళ్తున్నావు కాబోలు" అంది ఆవిడ గోరుచిక్కుడు కాయులు ఈనెలు తీస్తూ, "మీ మేష్టారితో రేపట్నుంచి రాలేనని చెప్పిరా."

"ఆఁ!"

ఆమాట కల్యాణికి కష్టం వినిపించింది. కాని ఏం చెయ్యగలదు ? గొడవలు మటుకు కొంత వరకూ తగ్గేయి.

ఏడెనిమిది నెలల తర్వాత ఒకరోజు భోజనాల దగ్గర అమ్మ మెల్లిగా మొదలుపెట్టింది, "అతనికి నాన్నా, పాటా అంటే చాలా యిష్టంట" అని.

కల్యాణి తలొంచుకుని భోజనం చేస్తోంది.

"ఏమో, నీ అదృష్టం బాగుంటే పెళ్ళయేక అతనే చెప్పించుకోకూడదూ !"

కల్యాణి జ్వాలలా లేచింది "అలాంటి మాటలు నాతో ఎప్పుడూ చెప్పకమ్మా ! పద్ధెనిమిదేళ్ళు పెంచిన మీకు అర్థంకాలేదు నా ఆశ లేవిటో. ఇంక .... ఇంక ...." కల్యాణి మాట్లాడలేక లేచి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ గుమ్మం దగ్గర నిలబడి "ఇంక నన్నేమీ అడక్కండి. నాతో ఏమీ చెప్పకండి. మీ యిష్టం ఎలా ఉంటే అలా చెయ్యండి" అనేసి వెళ్తున్న కల్యాణికి "దీని కింకా చిన్నతనం పోదల్లేదు" అని అమ్మ అనడం వినిపించింది.

నెల రోజులనాడు కల్యాణికీ, మురారికీ వైభవంగా పెళ్ళి జరిపించారు పెద్దలంతా కలిసి.

పెళ్ళి అవగానే మురారి కల్యాణిని తీసుకుని గుంటూరు వెళ్ళిపోయాడు.

* * *

మురారికి నాటకాలూ, సంగీతం పిచ్చి కొంచెం ఎక్కువ. నాట్యకళా సమితుల్లోనూ, గానకళా సమితుల్లోనూ ఎప్పుడూ మునిగి తేలుతుండే వాడు. కల్యాణి మొదట్లో ముభావంగా వూరు కున్నా తరవాత తరవాత మురారి బలవంతంమీదా, అతను టిక్కెట్లు కొనేస్తూండడం వల్లా అతనితో పాటు తను కూడా నాటకాలకీ, గాన సభలకీ వెళ్తూండేది. అయితే ఇంటిదగ్గర మాత్రం మురారికి ఆ విషయాలు చర్చించడానికి వీలుండేది కాదు. క్రమంగా ఇంట్లో "సంగీతం" అవాచ్యంగా మారి వూరుకొంది. అదొక "టాబూ". అనం స్కృతం.

రోజులు గడుస్తున్నకొద్దీ కల్యాణికి ఏదో నిరిత్తిగా, చికాగ్గా ఉండసాగింది. ఏదో భరించలేని ఆవేదనగా ఉంటుంటే, ఆఖరికి ఒకరోజు ఆలిండియా రేడియో, బెజవాడ వాళ్ళకి వాయిస్ టెస్ట్ ఇవ్వమని కోరుతూ ఒక ఉత్తరం వ్రాసి పడేసింది. వారం రోజులనాడు జవాబు వచ్చింది. ఆ ఉత్తరం అప్పుడే ఆఫీసునుంచి వస్తున్న మురారి అందు కున్నాడు.

"ప్రభుత్వం మంచి తమది కొచ్చే తాఖీ దేమిటో ?" అన్నాడు మురారి కవరుమీదున్న సర్వీస్ స్టాంపులు పరీక్షగా చూస్తూ.

"విప్పిచూస్తే పోతుందికదా" అంది కాఫీ డికాక్షన్ దింపుతున్న కల్యాణి.

మురారి సావిట్లో కుర్చీలో కూర్చుని కవరు విప్పి చూశాడు. అతని కనుబొమ్మలు ముడి పడ్డాయి.

"ఏమిటిది కల్యాణీ ?"

కల్యాణికి తెలీలేదు. "ఏమిటండీ" అంది అక్కడికి వచ్చి.

"రేడియోవాళ్ళు వాయిస్ టెస్ట్‌కి ఈ శని వారం రమ్మని వ్రాశారు. నువ్వు వాళ్ళకి వ్రాసేవా? అడిగాడు మురారి.

**అప్పుడు అర్థం అయింది కల్యాణికి. 'ఆఁ, నేనే వ్రాసేను. ఏం తొందరలేదు అంటాను" అంటూ**

ఆ తరవాత వారం పది రోజులనాడు మురారి హడావిడిగా వచ్చి, "వంట వేగిరం కానియ్. ఏకా దండయ్య వంతులు హాల్లో గోటు వాద్యకచేరి ఉంది. టిక్కెట్లు తీసుకున్నాను" అని చెప్పాడు.

"నే నివాళ రాలేను. మీరు వెళ్ళిరండి" అంది కల్యాణి చాలా శాంతంగా.

"ఏం ?"

"తల నొప్పిగా ఉంది."

"మాత్ర వేసుకుంటే అదే పోతుంది. ఇతను గోటు వాద్యం చాలా బాగా వాయిస్తాడని అందరూ మెచ్చుకుంటారు. పద" అన్నాడు మురారి.

**కాని కల్యాణి మటుకు [illegible] ఆశ్చర్యంగా** చెప్పింది. ఆ స్వరంలో నిశ్చయాన్ని చూసి మురారి మాటాడకుండా వెళ్ళిపోయాడు.

ఆ తరువాత రెండు మూడు మార్లు కూడా కల్యాణి ఇలాగే చెయ్యడంతో మురారికి ఏదో అను మానం వచ్చింది.

"ఏం ఈమధ్య నువ్వు అసలు పేటకే రావడం లేదు." అన్నాడు.

కల్యాణి మటుకు సాధారణమే అన్నట్టు, "ఏం లేదు. రావాలని ఉండడంలేదు" అంది.

"తీరిపోయిం దేమిటి సరదా." అని మందహాసం చేశాడు మురారి.

"ఆఁ. మీ సాంగత్యంతో" మెరుపులా జవాబు చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది కల్యాణి.

"నేనేం చేశాను. లోకాన్ని, మనుష్యుల్ని అర్థం చేసుకోడం నేర్చుకోవాలి" అనుకున్నాడు మురారి నేరం ఒప్పుకోలేని మగతనంతో.

* * *

"నాపుత్రుడు ఉత్తరం వ్రాశాడు." అన్నాడు మురారి కల్యాణి మీదకి హరి వ్రాసిన ఉత్తరం విసిరి.

"ఏం రాశాడు ?" అంది కల్యాణి ఉత్తరం తీసుకుంటూ.

"లక్ష్మీసమానురాలైన అమ్మకి,

నే నిచ్చిన టెలిగ్రాం అందిందనుకుంటాను. పాప ముమ్మూర్తులా నీపోలికే. ఇంకా నెలైనా కాలేదు. అప్పుడే కాళ్ళూ చేతులూ కొట్టుకొంటూ ఎలా ఆడు తోంది తెలుసా ? జానకేమో పాప నీలాగే ఉంటుం దనీ, నీ పేరే పెడతాననీ అంటోంది. నువ్వు చాలా అదృష్టవంతురాలివిట. పాప కూడా నీ అంత అదృష్టవంతురాలవాలిట. మరి నువ్వెప్పుడొస్తావు దాన్ని చూడ్డానికి ? జానకి పాపకి డ్యాన్సు నేర్పిస్తా నంటోంది !

ఇట్లు
హరి."

కల్యాణి కళ్ళు మూసుకుంది. పాప తన పోలికట ! ఎలా ఎక్కడ్నుంచి వస్తాయి ఈ పోలికలు ? తనని తన నాయనమ్మ పోలిక అనేవారు. మళ్ళీ తన మనుమరాలు తనని పోలింది. ఇలా ఒకళ్ళ నీడలు మరొకళ్ళమీద ఎందుకు పడతాయి ? ఇలా తాత ముత్తాతలు తరతరాలా ఎందుకు వస్తూనే ఉంటుంది ? తన అదృష్టం ? తను అనుకున్న ఏ విషయం అనుకున్నట్టుగా జరిగింది ? తను సాధించిం దేమిటి ? తనని పోలిందట. డ్యాన్సు నేర్పిస్తారట ! .... ఈ వయసు నుంచి పెంచు కున్న ఆశలు ! !

"మనవరాల్ని తల్చుకుని మురిసిపోవడమేనా ? నాకు కాఫీలాంటిది ఇవ్వడం ఏదేనా ఉందా ?" అని మురారి నవ్వడంతో కల్యాణి కళ్ళు తెరిచి ఈ లోకంలో పడింది.

కాఫీ పెట్టి తెస్తున్న కల్యాణికి హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది. ఔను, నిజం. నాయనమ్మకి రాని విద్య తనకి వచ్చు. తను సాధించ లేనిది ఈ పాప సాధించదని ఎందు కనుకోవాలి ? "దానికి "విజయభారతి" అని పేరు పెట్టమని వ్రాయండి. మీకు శలవు దొరగ్గానే చూడ్డానికి వెళ్దాం" అంది కల్యాణి దరహాసితవదనంతో. చాలా **కాలానికి కల్యాణి** మొహంమీద వెలిగిన చిర్నవ్వుని **ఆశ్చర్యంగా చూశాడు మురారి.** ★

# నడుస్తున్న చరిత్ర

21-వ పేజీ తరువాయి

"స్స్. ఇవాళ రేడియోలో, రేపు స్టేజిమీద, ఎల్లుండి డ్యాన్సు. ఇది నాకు నచ్చదు కల్యాణీ. ఛట్" అన్నాడు రసజ్ఞుడూ, కళాభిమానీ, గుణ వంతుడూ అయిన మురారి.

కల్యాణి తృళ్ళిపడింది. మరు క్షణంలో కల్యాణి అక్కడ లేదు. ఆ సాయంత్రం మురారికి కాఫీ రానూ లేదు.

ఏ మాత్రమో మిగిలిన చివరి తల్లివేరు కూడా ఆ చీత్కారంతో వూడిపోయింది.

# అయితే గియితే

అనురాగం పన్నులు అయితే
ఆనందం డిఫెన్సు అయితే
డిఫెన్సుకే లైఫిచ్చేద్దాం
అగ్రిమెన్ ఆపేశేద్దాం
చౌ-ఎన్-లై నీవే అయితే
చావాన్ భాయి నేనే అయితే
చావన్‌గా శివాజి నవుతా
చౌ-ఎన్-లేనే చీల్చేస్తా
బంగారం కొరవే అయితే
సింగారం సమాధి చేద్దాం
వద్దన్నా డబ్బే ఉంటే
ప్రభుత్వపు బొండ్లు కొంటాం
నీఫా లడక్ నీదే అయితే
పెకింగు చైనా మాదే కాదా
పంచశీలనే పఠనం చేస్తే
పాతన్నె హామే మననం చేద్దాం
పావలా డబ్బులు ఉంటే గింటే
ఆంధ్రపత్రిక మాదే అయితే
హామేషా తమాషా చేద్దాం
ఆనందంగా చదివేశేద్దాం.

శ్రీశ్రీకి కృతజ్ఞతతో సుబ్బారాయుడు (కడప)